క్లుప్తంగా

భయం వీడితేనే విజయం



మాట్లాడుతున్న భారతి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు పరీక్షలు అంటే భయపడొద్దని, ఇది వీడితేనే విజయం సొంతం అవుతుందని మానసిక నిపుణురాలు భారతి అన్నారు. శుక్రవారం చిన్నకోడూరు జూనియర్ కళాశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల మానసిక ఆందోళన, ఒత్తిడి జయించే విధానం, ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి రాణించాలన్నారు. అన్ని విషయాలపై సమగ్రంగా అవగాహన పెంచుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి శారీరక, మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకుంటే ఎన్ని అవరోధాలు వచ్చినా సులభంగా అధిగమించ వచ్చన్నారు. సమయపాలన అనేది ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు సునీత, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ



రెజ్లింగ్ పోటీల్లో గౌరవెల్లి పాఠశాల విద్యార్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థులు రెజ్లింగ్ క్రీడాపోటీల్లో ప్రతిభ చాటారు. మూడు రోజులుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బైరి ప్రవీణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. అప్పాల రేష్మిత, నిత్య, సంజన, పి.శ్రీహర్షిని, రత్నదీపిక, శైలజ, సాయి దీప్తి, శ్రీనిధి తదితరులు కూడా పతకాలను సాధించారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

పకడ్బందీగా 'ఇందిరమ్మ' సర్వే

దుబ్బాకటౌన్: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికలో నిష్పక్షపాతంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని రాయపోల్ ఎంపీడీఓ బాలయ్య అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నిజం చేయాలని ఉద్దేశంతో గృహాలు నిర్మించి ఇవ్వాలని సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించిందన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లి, రాముని పట్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే శుక్రవారం కూడా కొనసాగింది. అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరుతుందని ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బత్తుల మల్లేశం తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

టీచర్స్ సేవలు ఎనలేనివి



సంతోషను సన్మానిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి

దుబ్బాకటౌన్: ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం మంతూరు ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సంతోష వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంఈఓ పాల్గొని సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేక విద్య, శారీరక, మానసిక, భావోద్వేగ, అభ్యాస వైకల్యాలు ఉన్న పిల్లలకు బోధించడంలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయురాలు సంతోష పది సంవత్సరాలు ఉమ్మడి దౌల్తాబాద్ మండలంలో పనిచేయడం సంతోషమన్నారు. ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులుగా నూతనంగా విచ్చేసిన ఉపాధ్యాయురాలు శిరీషను సైతం సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు రాజు, కనకయ్య, కనకరెడ్డి, కళాకారుడు గణేశ్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం..



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న ఆర్ఏఎఫ్, పోలీసులు

హుస్నాబాద్ పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి పోలీసులు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. తామున్నామనే భరోసా కల్పిస్తుందన్నారు. – హుస్నాబాద్

సమ్మె ఎఫెక్ట్



తాళం వేసి ఉన్న మండల విద్యా వనరుల కేంద్రం

హుస్నాబాద్ మండల విద్యా వనరుల కేంద్రానికి శుక్రవారం తాళం వేసి ఉంది. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద కంప్యూటర్ ఆపరేటర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది సమ్మె చేస్తున్నారు. అందరూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే కావడం వల్ల కార్యాలయానికి తాళం పడింది. – హుస్నాబాద్‌రూరల్

29 నుంచి క్రికెట్ టోర్నీ

బెజ్జంకి(సిద్దిపేట): ఈనెల 29 నుంచి బెజ్జంకి క్రికెట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఉమ్మడి జిల్లా స్థాయి ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రీ ఫీజ్ 3,500 రూపాయలను చెల్లించి 28వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విన్నర్ ప్రైజ్ 40 వేల రూపాయలతో పాటు ట్రోఫీ, రన్నర్ ప్రైజ్ 30 వేల రూపాయలతో పాటు ట్రోఫీని అందిస్తామన్నారు. వివరాలకు 99593-13535, 90100-51678, 99086-42405, 77029-24834 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నత్తనడకన బ్రిడ్జి పనులు

వంతెన పనులు రెండేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో నంగునూరు, చిన్నకోడూరు మండలాల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకల కోసం బ్రిడ్జి పక్క నుంచి మట్టి రోడ్డు వేస్తే గుంతలమయంగా మారింది. వర్షం కురిస్తే వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కరీంనగర్ వైపు ప్రయాణించే వాహనాలు ఇతర మార్గాల గుండా వెళ్తుండగా దూరాభారం పెరుగుతోంది.

- వాహనదారులకు ఇబ్బందులు
- వాగు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు బంద్
- వేరే మార్గాల్లో ప్రయాణం దూరాభారానికి కారణం



దర్గపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండల ప్రజలు కరీంనగర్‌కు, అక్కడి వారు హన్మకొండకు వెళ్లేందుకు మల్లారం నుంచి సికింద్లాపూర్, దర్గపల్లి, బద్దిపడగ మీదుగా ప్రయాణిస్తారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని హైలెవల్ బ్రిడ్జి, రెండు పక్కల రోడ్డు నిర్మాణం కోసం రూ 7.15 కోట్లు మంజూరుకు కృషి చేసిన అప్పటి మంత్రి హరీశ్‌రావు 31 మార్చి 2022లో శంకుస్థాపన చేశారు. చిన్నకోడూరు మండలం మాచాపూర్ నుంచి నంగునూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. దర్గపల్లి నుంచి సికింద్లాపూర్ వెళ్లే దారిలో వాగు ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించిపోయేవి. అలాగే గతంలో నిర్మించిన బ్రిడ్జి తక్కువ ఎత్తులో ఉండడంతో వాహన దారులు ప్రవాహ వేగాన్ని గుర్తించకపోవడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా పలువురు ప్రమాదాల బారిన పడ్డారు.

రాకపోకలు బంద్

బ్రిడ్జి పక్క నుంచి వేసిన మట్టి రోడ్డు తరచూ నీట మునుగుతోంది. రాకపోకలు స్తంభించి పోతున్నాయి. ప్రమాదాల నివారణ కోసం తరచుగా ఈ మార్గాన్ని మూసి వేయాల్సి వస్తోంది. దీంతో వాగు వరకు వచ్చి తిరిగి వెనక్కి పోతున్నారు. ఆ మేరకు దూరాభారం పెరుగుతోందని వాహన దారులు వాపోతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రెండు సంవత్సరాలు అవుతున్నా పనులు పూర్తి చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బ్రిడ్జి నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

పనులు పూర్తి చేసేలా చర్యలు

బ్రిడ్జి నిర్మాణం పనులు ఆగిపోవడంతో పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీకాంత్, ఆర్అండ్‌బీ ఏఈఈ

కాంగ్రెస్‌ది కక్షపూరిత చర్య



మాట్లాడుతున్న మాజీ చైర్మన్ సాయిరాం

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతీకార చర్యలో భాగంగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద కేసు నమోదైందని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం ఆరోపించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సారయ్య, సీనియర్ నాయకుడు గుండు భూపేశ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్ మీద ప్రభుత్వం కేసు నమోదు చేయడాన్ని పార్టీ తరఫున ఖండించారు. ఆయన అవినీతి చేశారని ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఫార్ములా రేస్‌లో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. అక్రమ కేసులకు తెలంగాణ ఉద్యమకారులు భయపడేది లేదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, ప్రశాంత్ గౌడ్, శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాల్సిందే

బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని దళిత, అంబేడ్కర్ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆయా మండలాల్లో రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించారు. షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్బర్‌పేట-భూంపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌స్వామి మాట్లాడుతూ, షా వెంటనే దేశప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక)లో..



గజ్వేల్‌రూరల్: కొడకండ్లలో నిరసన తెలుపుతున్న నేతలు

నాట్యంతో ఆకట్టుకున్న చిన్నారి



నృత్య ప్రదర్శన చేస్తున్న ప్రీతిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆంధ్ర శ్రీశైలంలో జరిగిన నాట్య ప్రదర్శనలో సిద్దిపేటకు చెందిన నృత్యకారిణి దార ప్రీతిక ఆకట్టుకున్నట్లు శుక్రవారం హిమగిరి అకాడమీ నిర్వాహకురాలు సృజన తెలిపారు. శ్రీశైలంలోని భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో సిద్దిపేట నృత్య కళాకారులు రాణించారన్నారు. కళాకారిణికి ఆలయ నిర్వాహకులు ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపిక అందించినట్లు తెలిపారు.

'సీఎం కప్'లో విద్యార్థుల సత్తా

సిద్దిపేట ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సిద్దిపేట విద్యార్థినులు సీఎం కప్‌లో సత్తాచాటారు. సిద్దిపేటలో నిర్వహించిన పోటీల్లో పలు విభాగాల్లో మెడల్స్ సాధించి కళాశాల ప్రతిష్ట పెంచారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్‌తో పాటుగా అధ్యాపకులు అభినందించారు. అండర్ 20 మహిళా విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో మహాలక్ష్మి ప్రథమ స్థానం, శ్రీలత ద్వితీయ స్థానం, 400 మీటర్ల విభాగంలో మమత ద్వితీయ స్థానం, మహాలక్ష్మి తృతీయ స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో మమత తృతీయ స్థానం, లాంగ్ జంప్‌లో రేవన్య ప్రథమ, వైష్ణవి ద్వితీయ స్థానం సాధించారన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మీ ముందుకు

ఆర్ఎం ఉదయ్ కిరణ్



మాట్లాడుతున్న ఉదయ్ కిరణ్ తదితరులు

సిద్దిపేటకమాన్: ఏపీజీవీ బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్పు చేసుకుని జనవరి 1, 2025 నుంచి ఖాతాదారులకు అందుబాటులోకి రానున్నట్లు రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) ఆర్.ఉదయ్ కిరణ్ తెలిపారు. సిద్దిపేటలోని ఏపీజీవీబీ రీజినల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు పేరు మారుతున్న దృష్ట్యా న్యూ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అవుతున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంకు ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలిపారు. ఖాతాదారులు గమనించాలని సూచించారు. జనవరి 1 తర్వాత ఖాతాదారులకు నూతన ఏటీఎం కార్డులు జారీ కానున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ సేవల కోసం బ్యాంకు వారు జారీ చేసే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాలని సూచించారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో 51 బ్రాంచ్‌లున్నాయని, వీటిలో 4.80లక్షల మంది ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజర్ జీ.సతీశ్, బిజినెస్ మేనేజర్ రజాక్‌పాషా, సిబ్బంది రాజేశ్, ధర్మరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసు ఉపసంహరించుకోండి

ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ రవీందర్



మాట్లాడుతున్న రవీందర్

కొండపాక(గజ్వేల్): కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ రవీందర్ డిమాండ్ చేశారు. కుకునూరుపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని హామీలనిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న విషయాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజా పాలనను పక్కన బెట్టి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. హైదరాబాద్ నగరాన్ని అంత్యంత సుందరీకృతంగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్ నేతల్లో కేటీఆర్ ఒకరన్నారు. 2023లో దేశవ్యాప్తంగా ఉన్న అనేక నగరాలను కాదని ఈ ఫార్ములా రేస్ కోసం హైదరాబాద్ ఎంపిక కావడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారన్నారు. ప్రభుత్వం రుణమాఫీ, పెట్టుబడి సాయం హామీలను పక్కన బెట్టడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ప్రభుత్వ పాలన మాటలకే పరిమితమైందన్న విషయాన్ని ప్రజానీకం గుర్తించిందన్నారు. సీఎం వ్యవహార తీరును ప్రశ్నించినందుకు తప్పుడు కేసును పెట్టడం సరికాదన్నారు. కేసు ఉపసంహరించుకునే వరకు ప్రభుత్వంపై పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బచ్చలి మహిపాల్, పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి, నాయకులు రమేశ్‌గౌడ్, కృష్ణ, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



గెలిచిన కప్పుతో కబడ్డీ క్రీడాకారులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ యువత జాతీయ క్రీడల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. సీఎం కప్ జిల్లా కబడ్డీ పోటీల్లో హుస్నాబాద్ జట్టు ద్వితీయ స్థానం పొందగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ, యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం సీఎం కప్ క్రీడాపోటీలు ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదగాలన్నారు. జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆర్థిక ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్ చిత్తారి పద్మ, కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులరెడ్డి, బాలయ్య, కబడ్డీ కోచ్ మడక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల నివారణకు పటిష్ట చర్యలు

ఎస్సై శ్రీనివాస్



కుకునూరుపల్లిలో తనిఖీలు చేస్తున్న నార్కోటిక్స్ డాగ్స్

కొండపాక(గజ్వేల్): మత్తు పదార్థాలను అమ్మినా, రవాణా చేసిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. కుకునూరుపల్లిలోని అనుమానాస్పద ప్రదేశాల్లో, దుకాణాల్లో నార్కోటిక్స్ డాగ్స్ ద్వారా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా కిరాణా దుకాణాల్లో, పాన్ షాపుల్లో మత్తు పదార్థాల విక్రయాలకు అండగా మారిందన్నారు. మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్‌ను విక్రయించినా, రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆ గ్రామాలను విలీనం చేయొద్దు**

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో ఉన్న గౌరవెల్లి, జనగామ, గుబ్బడి గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కన్నపేట మండలానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామాలను అనవసరంగా కలపొద్దన్నారు. ఈ గ్రామాలు మండలానికి సమీప దూరాల్లోనే ఉంటాయన్నారు. ఈ గ్రామాలకు రోడ్డు మార్గం బాగుంటుందన్నారు. రవాణా సౌకర్యాలు సరిగ్గా లేని మిగిలిన గ్రామాలైన గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా, కేశవాపూర్, మంచినీళ్లబండ గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

◆ **ఎకరాకు రూ.లక్ష ఆదాయం**

తొగుట(దుబ్బాక): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహిస్తోందని మండల వ్యవసాయాధికారి మోహన్ తెలిపారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో సాగుచేసిన ఆయిల్ పామ్ తోటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఎకరాకు రూ. లక్ష వరకు ఆదాయం రైతులు పొందే అవకాశముందన్నారు. తోటలో అంతరపంటలు కూడా సాగు చేసుకుని రెండు విధాలుగా రైతులు ఆదాయం పొందే అవకాశముందన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి నంగునూరు మండలంలో ఆయిల్ పామ్ కంపెనీ అందుబాటులోకి వస్తోందన్నారు. మండలంలో 383 ఎకరాల్లో సాగుచేశారని చెప్పారు.

◆ **సీఎం కప్‌లో విద్యార్థుల ప్రతిభ**

మద్దూరు(హుస్నాబాద్): సీఎం కప్ క్రీడలలో శనిగరం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సిద్దిపేట డిగ్రీ కళాశాలలో జరిగిన కరాటే పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో 9వ తరగతి విద్యార్థినులు టీ శ్రీనిధి, సీహెచ్ అంజలిలు నిలిచారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సరళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **పశువుల షెడ్ ధ్వంసం**

కొండపాక(గజ్వేల్): పశువుల షెడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటన కుకునూరుపల్లి పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు రాజాగౌడ్ వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ కోసం రూ. 2లక్షలతో పశువుల షెడ్‌ను నిర్మించుకున్నాడు. గురువారం రాత్రి గురు తెలియని వ్యక్తులు దాన్ని ధ్వంసం చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా ఒక్క రోజు ముందు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండపాక మండలం సిర్సనగండ్లలో రాత్రి పూట ఇంటి వద్ద పార్కు చేసుకున్న ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. రెండు రోజులుగా ఈ ఘటనలు చేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

◆ **ఆటోడ్రైవర్ల నిర్బంధం**

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ స్టేట్ ఆటో డ్రైవర్స్ రియాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా స్థానిక ఆటోడ్రైవర్లను పోలీస్‌లు ఎక్కడికక్కడా ముందస్తు అరెస్ట్ చేశారు. శుక్రవారం తెల్లవారుజాము మద్దూరు మండలంలోని ఆటో డ్రైవర్లను వారు స్టేషన్‌కు తరలించారు. ఉచిత బస్సు పథకంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

నాగుబాయికి దిక్కెవరు?



బంధువుల పాత ఇంట్లో నాగుబాయి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా రోడ్డు వెడల్పు కోసం సహకరించి సొంత ఇళ్లను కోల్పోయారు. గత ప్రభుత్వం వీరికి డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇస్తామని హామీనిచ్చింది. నేటికీ నెరవేరలేదు. అద్దె ఇళ్లలోనే మగ్గుతున్నారు. విషయానికి వస్తే.. పట్టణానికి చెందిన నాగుబాయి మున్సిపల్ అభివృద్ధి రోడ్డు వెడల్పులో సొంతింటిని కోల్పోయింది. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇస్తుందనే ఆశతో కిరాయి ఇంట్లో ఉంటూ జీవనం గడుపుతోంది. ఇటీవల అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. అనంతరం వైద్యులు ఇంటికి డిశ్చార్జి చేశారు. కిరాయి ఇంటికి చేరుకోగా యజమాని అనుమతించలేదు. చేసేది లేక తమ పాత ఇంటి స్థలంలో రోడ్డుపైన మంచం ఏర్పాటు చేశారు. సమీప బంధువులు తమ పాత ఇంట్లో ఆశ్రయం కల్పించారు. ఏది ఏమైనా ఆమెకు డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.